ఊగిసలాట అధికం

సెన్సెక్స్ విశ్లేషణ

నవంబరు 18తో ముగిసిన వారానికి



సమీక్ష : ఐరోపా సంక్షోభం తీవ్రతరం కావడం; ఎఫ్ఐఐలు భారీ విక్రయాలకు పాల్పడడంతో మదుపుదారుల సెంటిమెంటు దెబ్బతింది. దీంతో గత వారమంతా మార్కెట్ నష్టాల్లోనే నడచింది. సెన్సెక్స్ అంతక్రితం రోజు అంతర్జాతీయ మార్కెట్ల కారణంగా ఆదిలో సానుకూలంగానే మొదలైంది. అయితే నిరుత్సాహకర కార్పొరేట్ ఫలితాలు, ఐరోపా మార్కెట్ల నుంచి బలహీనమైన సంకేతాలందిన కారణంగా భారీ స్థాయిలో లాభాల స్వీకరణ జరిగింది. ఇటలీ బాండ్లను యురోపియన్ కేంద్ర బ్యాంకులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో తక్కువ స్థాయిల వద్ద మార్కెట్లకు మద్దతు దొరికినప్పటికీ అది ఎక్కువ సేపు నిలవలేదు. రూపాయి మారకం విలువ క్షీణత కూడా సెన్సెక్స్‌ను 16500 దిగువకు తీసుకువచ్చింది. మొత్తంమీద 821 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ 16372 వద్ద ముగిసింది.

ఎఫ్ఐఐల పనితీరు అంతర్జాతీయంగా స్తబ్దుగా ఉన్న మార్కెట్ల ప్రభావంతో ఎఫ్ఐఐలు రూ.571 కోట్ల నికర విక్రయాలు చేశారు. ఫండ్‌లు సైతం రూ.158 కోట్ల నికర అమ్మకాలు చేశాయి.

రంగాల వారీగా స్థానిక మార్కెట్లలో అధోముఖ ధోరణి కనిపించడంతో పాటు ప్రధాన కంపెనీల ఫలితాలు అంచనాల కన్నా తక్కువగా వెలువడడంతో స్థిరాస్తి సూచీ కుంగింది. దేశీయంగా ఆర్థిక మందగమనానికి తోడు, డిమాండు తగ్గడంతో యంత్ర పరికరాల షేర్లు విక్రయాలకు లోనయ్యాయి. విద్యుత్తు షేర్ల సూచీ కూడా అదే దారి పట్టింది. అయితే ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎమ్‌సీజీ సూచీలు మాత్రం రాణించాయి. రూపాయి క్షీణత ఐటీ సూచీలో నష్టాలను తగ్గించింది.

శుక్రవారంనాడు లాభపడ్డ షేర్లు, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:2గా నమోదవడం.. స్థానిక మార్కెట్లలో బేరిష్ సెంటిమెంటు కొనసాగుతుండడాన్ని సూచిస్తోంది.

భవిష్యత్ అంచనా మంగళవారం మార్కెట్ కీలక మద్దతు స్థాయి అయిన 16899 దిగువన ముగిసింది. ఆ తరువాత శుక్రవారానికల్లా 16165 దాకా దిద్దుబాటుకు లోనయింది. దీన్ని బట్టి స్వల్పకాలంలో మార్కెట్‌కు 16899 కీలక నిరోధ స్థాయిగా పనిచేయగలదని అర్థమవుతోంది. దిగువ స్థాయిలో 15700- 15800 స్థాయి బలమైన మద్దతుగా ఉండొచ్చు. ఈ శ్రేణి కన్నా కూడా కిందకు వస్తే మాత్రం సెన్సెక్స్ 14000- 14500 దాకా దిద్దుబాటు జరిగే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు బలహీన అంతర్జాతీయ మార్కెట్లు మరికొన్ని రోజుల పాటు స్థానిక మార్కెట్లకు దిశా నిర్దేశం చేయవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం మరింత దిగివస్తే సానుకూలత కనిపించవచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత తగ్గిందంటే మదుపర్ల సెంటిమెంటు కుంగవచ్చు. అంతర్జాతీయ కమోడిటీ ధరలు, ముడి చమురు ధరలను మార్కెట్ సునిశితంగా గమనించనుంది. ఈ వారం మొదలవుతున్న పార్లమెంటు శీతకాల సమావేశాలపైనా మార్కెట్ దృష్టి పెడుతుంది. మరో పక్క డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు దగ్గరపడటం స్వల్పకాలంలో మరింత ఊగిసలాటలకు దారితీయవచ్చు.

తక్షణ నిరోధ స్థాయిలు: 16552, 16899, 17172 తక్షణ మద్దతు స్థాయిలు: 16165, 15745, 15075

ఏదైనా రికవరీకి 16899 స్థాయిల వద్ద నిరోధం ఎదురుకావొచ్చు

– సతీశ్ కంతేటి, జెన్‌మనీ